సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
శుక్రవారం । 18 । ఏప్రిల్ । 2025



కుంటుబడ్డ ఇంటి ప్రణాళికలు

పట్టణాల్లో బిల్డింగ్ ప్లాన్ అప్రూవల్స్‌పై రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీఓ 20ని లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్లు వ్యతిరేకిస్తున్నారు. దీంతో ప్లాన్ అప్రూవల్స్ నిలిచి, ఆదాయం తగ్గుతోంది.


10లో



పేదలకు ఇళ్ల స్థలాలివ్వాలి

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, ప్రభుత్వ భూముల కబ్జాలను నిరోధించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు.

5,300 క్యూసెక్కుల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు గురువారం 5,300 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 1,200, మధ్య డెల్టాకు 1,100, పశ్చిమ డెల్టాకు 3 వేల క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.05 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

జగ్గిరెడ్డికి అభినందనల వెల్లువ



గోపాలపురంలో జగ్గిరెడ్డిని అభినందిస్తున్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు

రావులపాలెం: వైఎస్సార్‌సీపీ జిల్లా నేతన అధ్యక్షునిగా నియమితులైన మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డిని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు అభినందించారు. ఎమ్మెల్సీ కుడిపూడి సూర్యనారాయణరావు, జిల్లా పార్టీ మాజీ అధ్యక్షుడు, ముమ్మిడివరం మాజీ ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్, కొత్తపేట జెడ్పీటీసీ సభ్యురాలు గూడపాటి రమాదేవి, మండపేట మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి, కోనసీమ, కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాలకు చెందిన పలువురు ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు రావులపాలెం మండలం గోపాలపురంలో జగ్గిరెడ్డి స్వగృహానికి వెళ్లి పూలమాలలు వేసి, పుష్పగుచ్ఛాలు అందచేసి అభినందనలు తెలిపారు.

రాజధాని పేరుతో దోపిడీ

- మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి గొల్లపల్లి

మలికిపురం: అమరావతి రాజధాని పేరుతో గతంలో దోపిడీకి పాల్పడినట్లే కొత్త నిర్మాణాలు అంటూ ప్రస్తుతం కూటమి ప్రభుత్వం దోపిడీకి తెర తీసిందని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు విమర్శించారు. గురువారం ఆయన మలికిపురంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన పార్టీ నాయకులు సోషల్ మీడియా విభాగం సమావేశంలో మాట్లాడారు. చంద్రబాబు ప్రభుత్వంలో అవినీతి తప్ప ఏమీ ఉండదన్నారు. రాజధాని వారి అవినీతికి కల్పవృక్షమని అన్నారు. ఏడాది పాలన దగ్గర పడుతున్నా అమలు చేయకుండా సూపర్ సిక్స్ పథకాలను మూలన పడేసిందన్నారు. నాటి ఎన్టీఆర్ పెట్టిన పింఛన్ పథకాన్ని మాజీ సీఎం జగన్ రూ.మూడు వేలకు పెంచారని , ప్రస్తుతం ప్రభుత్వం ఆ పింఛన్‌ను పెంచడం తప్ప ఇంకేమీ అమలు చేయడం లేదని పేర్కొన్నారు. ఉచిత బస్ ఊసే లేదు. గ్యాస్ లేదు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్ మెంట్ లేదని దుయ్యబట్టారు. విద్యుత్ చార్జీలను భారీగా పెంచిన ప్రభుత్వం ఇదేనన్నారు. బీసీ, ఓసీ, ఎస్సీ కార్పొరేషన్ బ్యాంకు రుణాలను అరకొరగా ఇవ్వడం విచారకరమన్నారు. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌కు గౌరవ సూచకంగా జగన్ విజయవాడలో నిర్మించిన అంబేడ్కర్ విగ్రహం వద్దకు దళితులు, సందర్శకులు వెళ్లకుండా కూటమి ప్రభుత్వం అడ్డుకుంటోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో పార్టీ నాయకులు పాటి శివ కుమార్, సూరిశెట్టి బాబి, కుసుమ చంద్రశేఖర్, కొల్లాబత్తుల సతీష్ బాబు, తాడి సహదేవ్, పెదపాటి నాగ లక్ష్మి, జిల్లెళ్ళ ఉదయ్ కిరణ్, అడబాల జానకీ రామ్ పాల్గొన్నారు.

పాపాలు చేస్తే శాపాలు తప్పవు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవ రం రూరల్): 'ఇతరులను హేళన చేస్తే పరాభవం తప్పదు. అధర్మవర్తనంతో తపోబలం క్షీణిస్తుంది. పాపాలు చేస్తే శాపాలు తప్పవు' అని ప్రవచన విరించి సామవేదం షణ్ముఖశర్మ అన్నా రు. ఋషిపీఠం సత్సంగం ఆధ్వర్యాన స్థానిక టి.నగర్‌లోని హిందూ సమాజంలో ఉత్తరకాండపై మూడో రోజు ప్రవచనాన్ని ఆయన కొనసాగించారు. 'నీది వానరముఖం అని నందీశ్వరుడిని హేళన చేసిన రావణునికి వానరుల చేతిలో పరాభవం తప్పదన్న శాపం ఎదురైంది. వేదవతిని పరాభవించినప్పుడు ఆమె మరుసటి జన్మలో అయోనిజగా జన్మించి, సపరివారంగా రావణుడు నశించడానికి కారకురాలినవుతానని శపించింది. ఇక్ష్వాకువంశానికి చెందిన రాజు అనరణ్యుడు.. రావణుని చేతిలో పరాజితుడై, మా వంశంలో జన్మించే శ్రీరాముని చేతిలో నీవు మరణిస్తావని శపించాడు. రావణుని చేతిలో బందీలుగా చిక్కిన ఎందరో దేవకాంతలు, ఋషి కన్యలు, మానవకాంతల కన్నీరే రావణుని పాలిట పెనుశాపంగా మారింది' అని అన్నారు. ధర్మాచరణతో అల్పాయుష్కుడు కూడా దీర్ఘాయువు పొందగలడని, దీనికి విలోమంగా దీర్ఘాయువు వరంగా గలవాడు కూడా పాపకృత్యాలతో అల్పాయుష్కుడు కాగలడని చెప్పారు. 'కైలాసగిరిని పెకలించబోయి భంగపాటుకు గురైన రావణుడు రోదించినప్పుడు, శివుడు అతనికి విడుదల ప్రసాదించి, ఇక నుంచి నీవు రావణుడిగా పేరు పొందుతావని అన్నాడు. రామ అనే శబ్దానికి అందరికీ ఆనందాన్ని కలిగించేదని అర్థమైతే, రావణ శబ్దానికి అందరినీ ఏడిపించడం అనే అర్థం ఉంది' అన్నారు.

కోనసీమలో అంధకారం

- కూలిపోయిన 132 కేవీ టవర్
- కె.గంగవరం మండలంలో ఘటన
- మంగళవారం నుంచి లోడ్ రిలీఫ్ పేరుతో విద్యుత్ కోతలు
- ఆక్వా రైతుల లబోదిబో
- ఆర్‌డబ్ల్యూఎస్ ప్రాజెక్టులలో నీటి పంపింగ్‌కు అంతరాయం
- ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరి

సాక్షి, అమలాపురం: కొత్తపేట సబ్‌స్టేషన్‌కు విద్యుత్ సరఫరా చేసే 132 కేవీ విద్యుత్ టవర్ కూలిపోతే... లోడ్ రిలీఫ్ పేరుతో జిల్లాలో మూడు రోజులుగా మూడొంతుల ప్రాంతాలను అంధకారంలో ముంచేశారు. రెసిడెన్షియల్, కమర్షియల్, ఇండస్ట్రియల్ ఇలా అన్నివర్గాల వారు విద్యుత్ కోతల బారిన పడి లబోదిబోమంటున్నారు. ఉక్కపోతతో సామాన్యులు, మంచినీటి ప్రాజెక్టుల వద్ద మోటార్లు తిరగక తాగునీరందక శివారు గ్రామ వాసులు, చీకట్లో అమ్మకాలు తగ్గి వ్యాపారులు, ఏరియేటర్లు తిరగక ఆక్వా రైతులు గగ్గోలు పెడుతున్నా జిల్లా ఏపీఈపీడీసీఎల్ అధికారులకు చీమ కుట్టినట్టయినా లేదు.



ఉప్పలగుప్తం మండలం పెదగాడవిల్లిలో గురువారం అర్ధరాత్రి జనరేటర్‌లో డీజిల్ నింపుతున్న ఆక్వా రైతు



రోజుకు 600 లీటర్లు: అల్లవరం మండలం సామంతకుర్రుకు చెందిన గుంటూరి సీతారామరాజు 22 ఎకరాలలో ఆక్వా సాగు చేస్తున్నారు. విద్యుత్ కోతల వల్ల జనరేటర్‌కు రోజుకు 600 లీటర్ల డీజిల్ వినియోగిస్తున్నారు. గత మూడు రోజుల్లో ఆయన 1,800 లీటర్ల డీజిల్ వినియోగించినట్టు తెలిపారు.

కె.గంగవరం మండలం కోటిపల్లి సమీపంలో మంగళవారం మధ్యాహ్న సమయంలో ఈదురుగాలులకు 132 కేవీ విద్యుత్ టవర్ కూలిపోయింది. ఈ టవర్ పాతది అయిపోవడంతో బలమైన గాలులకు పంట చేలల్లో కూలిపోయింది. రామచంద్రపురం నుంచి 132 కేవీ విద్యుత్తు లైను కొత్తపేట, ముమ్మిడివరం, అమలాపురం వచ్చే లైన్‌లో ఉంది. పగటిపూట విద్యుత్తు సరిపోతున్నా రాత్రి అయ్యేసరికి ఒక బిలియన్ యూనిట్ కరెంటు తక్కువ వస్తోంది. దీంతో మూడు రోజుల నుంచి రాత్రి సమయంలో ఎమర్జెన్సీ లోడ్ రిలీఫ్ అమలు చేస్తున్నారు. ప్రత్యామ్నాయంగా భీమవరం జిల్లా ఉండి 132 లైన్ నుంచి కోనసీమకు విద్యుత్తు అందిస్తున్నారు. ప్రతిరోజు కోనసీమలో 4.96 బిలియన్ల విద్యుత్తు వాడకం జరుగుతుంది. విద్యుత్ కోతలతో సామాన్యులు ఉక్కపోతకు గురవుతున్నారు. వర్షాల ప్రభావం తగ్గడంతో బుధవారం నుంచి ఎండ తీవ్రత పెరగడంతో సామాన్యులు ఆపసోపాలు పడుతున్నారు. రాజోలు దీవిలో 90 తాగునీటి సరఫరా చేసే ట్యాంకులపై విద్యుత్ కోత ప్రభావం పడింది. రాత్రి వేళ పంపింగ్ చేసి ఉదయం ప్రజలకు తాగునీరు ఇవ్వాల్సి ఉంది. రాజోలు దీవిలో సముద్ర తీర ప్రాంతాలు అధికంగా ఉండడం వల్ల వేసవి వల్ల తాగునీటికి ఇబ్బంది అధికం. నియోజకవర్గంలో 60 గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పది రోజులుగా ఈ సమస్య తీవ్రంగా ఉండగా మూడు రోజుల నుంచి రాత్రి వేళలో



అల్లవరంలో మోటార్ సైకిళ్లపై డీజిల్ పట్టుకుని వెళుతున్న రైతులు

ఏడు గంటలకు పైగా కరెంట్ కోత వల్ల తాగునీటి సమస్య మరింత జటిలమైంది. అమలాపురం నియోజకవర్గం పరిధిలో చల్లపల్లి, కూనవరం, చిందాడగరువు, గుడిమెల్లంక, ముమ్మిడివరం నియోజకవర్గం పరిధిలో పోలమ్మ చెరువు, మురమళ్ల, పల్లం వంటి ప్రాంతాల్లో మంచినీటి సరఫరాకు సైతం అంతరాయం ఏర్పడింది.

నత్తను తలపించేలా..

అత్యవసర సమయంలో యుద్ధ ప్రాతిపదికన టవర్ నిర్మాణ పనులు చేసి సరఫరా పునరుద్ధరించాల్సిన అధికారులు నత్తను తలపించే పనులు నిర్వహిస్తూ జనంతో ఆటలాడుకుంటున్నారు. పొలాల్లోకి వెళ్లేందుకు రైతులు అంగీకరించడం లేదనే సాకుతో పనులు ఆలస్యం చేస్తున్నారు. దీనిపై అన్నివర్గాల నుంచి ఆందోళన వ్యక్తమవుతున్నా అధికారులు మాత్రం తమ సహజసిద్ధమైన ఆలస్యాన్నే ప్రదర్శిస్తున్నారు. ఇంత జరుగుతున్నా జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు అధికారులపై వత్తిడి తెచ్చి పనులు వేగంగా పనులు చేయించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గురువారం సాయంత్రానికి టవర్ నిర్మాణం పూర్తి చేశారు. అర్ధరాత్రి నుంచి విద్యుత్ ఇస్తామని చెబుతున్నా శుక్రవారం ఉదయం నుంచి కాని సాధారణ పరిస్థితులు నెలకొనేలా లేవు. కొత్త టవర్ నిర్మాణం దాదాపు గురువారం రాత్రికి పూర్తవుతుందని, విద్యుత్ లైన్ ఎక్కించి అర్ధరాత్రి నుంచి కరెంట్ అందించేలా చర్యలు చేపట్టినట్టు ఎస్ఈ సిద్ధల రాజబాబు తెలిపారు.

ఆక్వాకు పెను ముప్పు

టవర్ కూలిపోయి విద్యుత్ సరఫరాకు భారీగా కోత పెట్టడంతో ఆక్వా రైతులకు ఊపిరాడడం లేదు. అసలే అమెరికా సుంకాల పేరుతో ధర తగ్గి పెట్టుబడులు వస్తే చాలనట్టుగా ఉంది పరిస్థితి. ప్రస్తుతం కోనసీమ జిల్లాలో పట్టుబడులకు వచ్చిన చెరువులు అధికంగా ఉన్నాయి. ఈ చెరువుల్లో డెడ్ ఆక్సిజన్ (డీవో) బారిన రొయ్యలు పడకుండా నిరంతరాయంగా ఏరియేటర్లను తిప్పి ఆక్సిజన్ అందించాల్సి ఉంది. ఏరియేటర్లు, మోటార్లకు విద్యుత్ అత్యవసరం. ఈ నేపథ్యంలో మంగళవారం, బుధ, గురువారాల్లో ఒక గంట విద్యుత్ ఇస్తే.. మూడు గంటలు కోత పెడుతున్నారు. అల్లవరం మండలంలో అయితే బుధవారం రాత్రి కేవలం ఒక్క గంట మాత్రమే విద్యుత్ సరఫరా జరిగిందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఐ.పోలవరం, ముమ్మిడివరం, కాట్రేనికోన, అల్లవరం, ఉప్పలగుప్తం, అమలాపురం, మామిడికుదురు, మలికిపురం, సఖినేటిపల్లి మండలాల్లో చెరువుల్లోని రొయ్యలు కౌంట్‌కు వచ్చి ఉన్నాయి. సుమారు ఎనిమిది వేల ఎకరాల్లో ఆక్వా చెరువులు విద్యుత్ కోత బారిన పడ్డాయి. చెరువులలో రొయ్యలు, కౌంట్‌లను బట్టి ఎకరాకు రోజుకు డీజిల్ బిల్లు రూ.2,500 నుంచి రూ.7,000 వరకు అవుతుండడంతో ఆక్వా రైతులు ఆందోళన చెందుతున్నారు. మూడు రోజుల పాటు విద్యుత్ కోతల వల్ల ఆక్వా రైతులకు డీజిల్, అదనపు కూలీల రూపంలో రూ.ఐదు కోట్లకు పైగా భారం పడిందని అంచనా. అల్లవరం మండలం సామంతకుర్రుకు చెందిన ఒక రైతు మూడు ఎకరాల రొయ్యల సాగుకు విద్యుత్ కోత వల్ల జనరేటర్ల మీద ఏరియేటర్లు తిప్పుతున్నారు. రోజుకు రూ.ఏడు వేల చొప్పున డీజిల్ అవుతోంది. మూడు రోజులకు రూ.21 వేలు అయ్యింది.

గంటల తరబడి నిరంతరాయంగా జనరేటర్లను నడపాల్సి వస్తోంది. దీనివల్ల వాటి సామర్థ్యం తగ్గిపోవడం, కొన్ని జనరేటర్లు పని చేయకుండా పోవడం వల్ల చెరువుల్లో ఏరియేటర్లు నిలిచిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. దీంతో చెరువు గట్ల మీదనే మోటార్లు ఏర్పాటు చేసి చెరువులో నీటిని తిరిగి చెరువులోకి పంపింగ్ చేయడం ద్వారా కృత్రిమ అలలతో ఆక్సిజన్ సృష్టించాల్సి వస్తోంది. ఇది కూడా రైతులకు భారంగా మారింది. ఒక్కొక్క జనరేటర్ ఖరీదు రూ.2.50 లక్షల నుంచి రూ.6 లక్షల వరకు ఉంటోంది. రెండు మూడు ఎకరాలు సాగు చేసే రైతు వద్ద 40 వాట్స్ జనరేటర్ ఒకటి తప్పనిసరి. నిరంతరాయంగా పని చేయడం వల్ల ఇవి పేలిపోయే పరిస్థితి నెలకొందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



కె.గంగవరం మండలం కోటిపల్లి సమీపంలో టవర్ కూలిపోయిన చోట కొత్త టవర్ నిర్మాణం

ఓఎన్‌జీసీ రైతులను ముంచేసింది

ప్రజాభిప్రాయ సేకరణలో ఆగ్రహం

అలమూరు: ఓఎన్‌జీసీ సంస్థ చిన్న, సన్నకారు రైతుల భూములను దోచుకుని నిలువునా ముంచేసిందని మండలంలోని వివిధ గ్రామాల రైతులు మండిపడ్డారు. ఆయిల్ అండ్ న్యాచురల్ గ్యాస్ కమిషన్ (ఓఎన్‌జీసీ), కాలుష్య నియంత్రణ మండలిశాఖ సంయుక్తంగా గురువారం పర్యావరణ పరిరక్షణపై అభిప్రాయం సేకరించాయి. ఆలమూరు శివారు కొత్తూరు సెంటర్‌లోని ఎస్ఆర్‌జే కల్యాణ మంటపంలో ఓఎన్‌జీసీ ప్రధాన అధికారి కేవీకే రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నిషాంతి, రామచంద్రపురం ఆర్‌డీఓ అఖిల పాల్గొన్నారు. ప్రజాభిప్రాయ సేకరణలో ఓఎన్‌జీసీకి భూములిచ్చిన రైతులు అధికారులు తగిన న్యాయం చేయకుంటే ఆత్మహత్యలే శరణ్యమంటూ వ్యాఖ్యానించారు. తమ భూములను లీజుకు తీసుకుని అందులో లభ్యమైన చమురు సహజ వాయువు నిక్షేపాలతో రూ.వందల కోట్ల ఆదాయాన్ని సమపార్జిస్తున్న



ప్రజాభిప్రాయ సేకరణలో అధికారులను ప్రశ్నిస్తున్న రైతులు


ఓఎన్‌జీసీ మాత్రం తమకు మాత్రం తీరని అన్యాయం చేస్తోందని, రహదారులను ధ్వంసం చేస్తోందని దుయ్యబట్టారు, ఓఎన్‌జీసీ సంస్థ ఒకసారి భూములు లీజుకు తీసుకున్నాక ఏళ్ల తరబడి ఆదే లీజును చెల్లిస్తూ రైతులకు అన్యాయం చేస్తుందన్నారు. రైతులకు ఏ అవసరం వచ్చినా ఓఎన్‌జీసీకి లీజుకిచ్చిన భూమిని అమ్ముకోవడానికిగానీ, ఎవరి వద్దనైనా తనఖా పెట్టుకుని రుణం తెచ్చుకోవడానికి అవకాశం ఉండడం లేదని ఆవేదన చెందారు. ఓఎన్‌జీసీ తవ్వకాలకు సంబంధించి చేపడుతున్న పేలుళ్ల వల్ల దెబ్బతింటున్న గృహాలకు బీమా చేయాలని పలువురు సూచించారు. కేంద్ర ప్రభుత్వం, ఓఎన్‌జీసీ ఉన్నతాధికారులతో సంప్రదించి రైతులకు న్యాయం చేస్తామని ఓఎన్‌జీసీ ప్రధాన అధికారి కేవీకే రాజు అన్నారు. ఓఎన్‌జీసీ రిగ్‌లు ఉన్న ప్రాంతాల అభివృద్ధికి సీఎస్ఆర్ నిధులను మంజూరు చేస్తామన్నారు. రహదారుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని చెప్పారు.

రూ.84.96 కోట్లతో అభివృద్ధికి ప్రతిపాదనలు

మండపేట సీజీఎస్ పరిధిలోనున్న కొత్తపేట నియోజకవర్గాన్ని సుమారు రూ.84.96 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ప్రతిపాదనలను జాయింట్ కలెక్టర్ నిషాంతి, ఓఎన్‌జీసీ ప్రధాన అధికారి రాజుకు అందజేశారు. రహదారులు, భవనాలు, కళాశాలల అభివృద్ధికి ఆ నిధులను కేటాయించాలన్నారు ఓఎన్‌జీసీ అధికారులు నాగిరెడ్డి, శంకరరావు, పర్యావరణ వేత్తలు జేటీ రామారావు, రవీంద్రారెడ్డి పాల్గొన్నారు.

ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటుకు స్థలాల ఎంపిక

అమలాపురం రూరల్: అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) పార్కుల ఏర్పాటుకు ముమ్మిడివరం, రాజోలు, పి గన్నవరం నియోజకవర్గాలలో స్థలాలు ఎంపిక చేసినట్లు కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ తెలిపారు. గురువారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ 26 జిల్లాల కలెక్టర్లతో అమరావతి నుంచి వివిధ అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఉచిత ఇసుక పాలసీ ద్వారా వర్షాకాలంలో భవన నిర్మాణ రంగం నిరంతరాయంగా పనులు కొనసాగించేలా స్టాక్ యార్డులలో సుమారు 20 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వలు చేయాలని ఆదేశించారు. మాన్యువల్ సెమీ మెకనైజ్డ్ రీచులలో ఇసుక తవ్వకాలను మే, జూన్ మాసాలలో ముమ్మరం చేసి స్టాక్ యార్డులకు ఇసుకను తరలించి నిల్వ చేయాలని ఆదేశించారు. పంట కాలువలు మూసివేసే లోగా సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులను పూర్తిగా నింపుకోవాలన్నారు. మూడో శనివారం ఎలక్ట్రానిక్ వ్యర్థాల (ఈ– వేస్ట్) రీసైక్లింగ్ కార్యక్రమాన్ని ప్రత్యేక అధికారి పర్యవేక్షణలో నిర్వహించాలన్నారు. డీపీఓ శాంతిలక్ష్మి, మున్సిపల్ కమిషనర్లు వీవీపీ నాయుడు కేవీవీ ఆర్ రాజు, ఆర్‌డబ్ల్యూఎస్ డివిజనల్ ఇంజినీర్ పద్మనాభం, జలవనరుల శాఖ కార్యనిర్వాహక ఇంజినీర్ బి.శ్రీనివాసరావు, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ పీకే పీ ప్రసాద్, డీఏపీ ఆర్ఓ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



ఇసుక కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

ఒకటి నుంచి ఇసుక తవ్వకాలు

జిల్లాలోని ఐదు సెమీ మెకనైజ్డ్ ఇసుక రీచులలో మే ఒకటో తేదీ నుంచి ఇసుక తవ్వకాల నిర్వహించాలని కలెక్టర్ ఇసుక కమిటీ సభ్యులకు సూచించారు. గురువారం జిల్లా ఇసుక కమిటీ సమావేశం ఆయన అధ్యక్షతన కలెక్టరేట్‌లో నిర్వహించారు.

ఫలించని పడికాపులు!

- కోనసీమ జిల్లాలో ఇద్దరు జనసేన ఎమ్మెల్యేలు
- ఇద్దరి పరిధిలో మూడు మార్కెట్ కమిటీ చైర్మన్ పదవులు
- నగరం ఏఎంసీ ఎస్సీ మహిళ...
- రాజోలు ఎస్సీ లేదా బీసీలకు అవకాశం
- ఆశలు పెట్టుకున్న అంబాజీపేట లోకేశ్ కోటాలో కమ్మ వర్గానికి కేటాయింపు
- గోదావరి ప్రాజెక్టు కమిటీలోనూ చేదు ఫలితమే
- సొంత పార్టీ ఎమ్మెల్యేలపై మండిపడుతున్న ఆ వర్గీయులు

సాక్షి, అమలాపురం: 'రాష్ట్రం అంతా ఓడిపోతే 2019లో రాజోలు గెలిపించాం... ఇటీవల జరిగిన ఎన్నికల్లో రాజోలుతోపాటు పి.గన్నవరం గెలుపులో కూడా కీలక పాత్ర పోషించాం. కాని పదవులు కేటాయించాల్సి వచ్చేటప్పటికి మాత్రం మాకు ప్రాతినిధ్యం లేకుండా పోయింది. కాపు కాసినా గుర్తింపు లేకుండా పోయిందని మదనపడుతున్నారు జనసేనలోని కాపు సామాజికవర్గానికి చెందినవారు. కోనసీమ జిల్లాలో జనసేన ప్రాతినిధ్యం వహిస్తున్న రెండు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో నామినేటెడ్ పదవుల కేటాయింపులో జరుగుతున్న అన్యాయంపై సొంత పార్టీ ఎమ్మెల్యేలపై రగిలిపోతున్నారు.

చెదిరిన ఆశలు

గత ఎన్నికల్లో రాజోలు, పి.గన్నవరం నుంచి జనసేన తరపున పోటీ చేసిన దేవ వరప్రసాద్, గిడ్డి సత్యనారాయణ గెలిచిన విషయం తెలిసిందే. ఈ రెండు ఎస్సీ నియోజకవర్గాలు కావడం గమనార్హం. రాజోలు నుంచి జనసేన వరుసగా రెండవసారి గెలవగా, పి.గన్నవరం నియోజకవర్గం పార్టీ సభ్యత్వాల నమోదులో రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచింది. తమ ప్రయత్నాల వల్లే జనసేన అభ్యర్థులు గెలిచారని నియోజకవర్గంలో కాపు సామాజికవర్గం నాయకులు జబ్బలు చరుచుకున్నారు. నామినేటెడ్ పదవులలో తమకు సింహభాగం దక్కుతాయని ఆశించారు. జిల్లా, రాష్ట్రస్థాయి కార్పొరేషన్‌లు, అగ్రికల్చర్ మార్కెట్ కమిటీలు, ప్రధాన దేవస్థానాల చైర్మన్ పదవులలో సింహభాగం దక్కుతాయని ఆశించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి రోజులు గడుస్తున్న కొద్దీ వారి ఆశలు చెదిరిపోతున్నాయి.

రాష్ట్రస్థాయి కార్పొరేషన్ పదవులకు సంబంధించి ఈ రెండు నియోజకవర్గాల పరిధిలో కాపులకు ఒక్కరికి మాత్రమే అధికారికంగా అవకాశం దక్కింది. రాజోలు నియోజకవర్గం నుంచి ఏపీ మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల నరసింహారావుకు డైరెక్టర్ పదవి వచ్చింది. కాపుల నుంచి అవకాశం వచ్చింది. అయితే పి.గన్నవరం నియోజకవర్గంలో అంబాజీపేటకు చెందిన శిరిగినీడి వెంకటేశ్వరరావును రాష్ట్ర జలవనరుల కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఎంపిక చేశారు. కాని నెలలు గడుస్తున్నా ఉత్తర్వులు మాత్రం విడుదల కాకపోవడం గమనార్హం.

ఏఎంసీలలో మొండిచేయి

ఎమ్మెల్యే తరువాత నియోజకవర్గంలో కీలకమైనది అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) చైర్మన్ పదవి. రాజోలు నియోజకవర్గం పరిధిలో తాటిపాక, పి.గన్నవరం నియోజకవర్గం పరిధిలో అంబాజీపేట, నగరం మార్కెట్ కమిటీలున్నాయి. ఈ మూడు పదవులలో కాపు సామాజికవర్గానికి చెందినవారు నగరం, అంబాజీపేట ఆశించారు. ఈ మూడుచోట్ల వారికి అవకాశం లేకుండా పోయింది. నగరం ఏఎంసీ ఎస్సీ మహిళకు రిజర్వ్ కాగా జనసేనకు చెందిన పెనుమాల లక్ష్మికి అవకాశం కల్పించారు. అంబాజీపేట జనరల్ కాగా టీడీపీకి చెందిన చిట్టూరి శ్రీనివాస్‌ను ఎంపిక చేసి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. తాటిపాక ఏఎంసీని ఆనవాయితీ ప్రకారం బీసీలలో శెట్టిబలిజలకు ఇస్తున్నందున జనసేనకు చెందిన గుబ్బల ఫణికుమార్‌ను దాదాపుగా ఎంపిక చేశారు. ఇప్పుడు ఎస్సీలకు రిజర్వ్ అవుతోందని ప్రచారం జరుగుతోంది. ఇలా జరిగినా ఇక్కడ కాపులకు అవకాశం లేదు. జనరల్ అయినా కూడా బీసీలకే ఇవ్వాలని స్థానిక ఎమ్మెల్యే దేవ వర ప్రసాద్ నిర్ణయించినట్టు తెలిసిందే. దీంతో ఈ రెండు నియోజకవర్గాల పరిధిలోని మూడు ఏఎంసీలలో ఒక్కటి కూడా కాపులకు దక్కలేదు. నగరం, తాటిపాక కన్నా అంబాజీపేట ఏఎంసీ చైర్మన్ పదవి రాకపోవడం జీర్ణించుకోలేకపోతున్నారు. ఇది జనసేన పార్టీలో కీలకంగా ఉన్న కొర్లపాటి గోపీకి దక్కుతుందని అందరూ భావించారు. జనసేనలోని ఒక వర్గం అడ్డుకుంది. ఇదే వర్గం ఈ పదవి టీడీపీలోని కాపులకు ఇవ్వాలని పట్టుబట్టడం ... ఎమ్మెల్యే గిడ్డితో చివాట్లు తినడం విశేషం. ఈ విభేదాలను ఎమ్మెల్యే గిడ్డి తనకు అనుకూలంగా మలుచుకుని నగరంలో తనకు అత్యంత సన్నిహితులకు పదవి వచ్చేలా చూసుకున్నారు.

ధవళేశ్వరం మధ్య డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్ (టీడీపీ)కి అవకాశం దక్కింది. ఈ పదవి తమకే వస్తుందని కాపులు ఆశించారు. ఇందుకు ప్రయత్నాలు చేసినా ఫలితం దక్కలేదు. ఈ రెండు నియోజకవర్గాల పరిధిలో ఉన్న పెద్ద దేవాలయాలైన అంతర్వేది లక్ష్మీ నర్సింహస్వామి, అప్పనపల్లి శ్రీ బాలబాలాజీ స్వామి పాలకవర్గాల చైర్మన్ పదవులు సైతం ఈ సామాజికవర్గానికి దక్కే అవకాశం లేకుండా పోయింది. తమకు అవకాశం కల్పించాలని స్థానిక ఎమ్మెల్యేలు, పార్టీ అధిష్టానం పెద్దల వద్ద మొర పెట్టుకున్నారు.



అంబాజీపేట మార్కెట్ యార్డు

ఇలా కీలక పదవులలో తమకు అవకాశం రాక పోవడంతో ఆ వర్గానికి చెందిన వారు సొంత పార్టీ ఎమ్మెల్యేలపై.. పార్టీ పెద్దల వద్ద పలు సందర్భాలలో మొర పెట్టుకున్నా ఫలితం లేకుండా పోయింది.

క్లుప్తంగా

లారీ డ్రైవర్‌కు ఆరు నెలల జైలు

సామర్లకోట: ఇద్దరు మహిళల మృతికి కారణమైన లారీ డ్రైవర్‌కు ఆరు నెలల జైలు, రూ.5,500 జరిమానా విధిస్తూ కాకినాడ ఐదవ కోర్టు మెజిస్ట్రేట్ షేక్ షరీన్ గురువారం తీర్పు ఇచ్చారని సీఐ ఎ.కృష్ణభగవాన్ తెలిపారు. 2022, నవంబర్ 10వ తేదీన పీబీ దేవం రైల్వే గేటు ఎదురుగా ఇద్దరు మహిళలను లారీ ఢీకొంది. వేట్లపాలెం నుంచి ద్వారపూడి అయ్యప్పస్వామి గుడికి నడిచి వెళుతున్న సమయంలో వెనుక నుంచి వస్తున్న లారీ మహిళలను ఢీ కొనడంతో వారు అక్కడికక్కడే మృతి చెందారు. అనకాపల్లి జిల్లా గుట్టివాడకు చెందిన అద్దం భాస్కరం లారీని నిర్లక్ష్యంగా నడపడం వలన ఈ ప్రమాదం జరిగిందని అప్పటి ఎస్సై టి.సునీత కేసు నమోదు చేశారు. ప్యాసిక్యూషన్ తరపున పీపీ రఘువీర్ వాదించారు. వాదనల అనంతరం జడ్జి తీర్పు ఇచ్చారని తెలిపారు.

మహిళా కూలీకి పాముకాటు

సీతానగరం: మండలంలోని ముగ్గళ్లకు చెందిన ఉపాధి హామీ పథకం కూలీ జక్కల బేబి పాముకాటుకు గురైంది. గురువారం ఉదయం ముగ్గళ్లలో పంటకాలువ పూడికతీత పనులకు 70 మంది కూలీలు పనిలోకి వెళ్లారు. జక్కల బేబి కాలువ పూడిక తీస్తుండగా బురదలో ఉన్న పాము కుడికాలుపై కాటు వేసింది. దాంతో ఒక్కసారిగా కేకలు వేయడంతో కూలీలు బేబికి ఉపశమన చర్యలు చేశారు. సమాచారం అందుకున్న ఏపీవో బీవీ సత్యవతి ఘటనా స్థలానికి చేరుకుని సీతానగరం పీహెచ్‌సీకి తరలించారు. అక్కడ వైద్యసేవలు పొందిన అనంతరం మెరుగైన వైద్యసేవలకు రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి 108 అంబులెన్స్‌లో తరలించారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

తుని: అన్నవరం–హంసవరం మధ్యలో రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి చెందాడని తుని జీఆర్పీ ఎస్సై జి.శ్రీనివాసరావు తెలిపారు. గురువారం అందిన సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి తెలిపిన వివరాల ప్రకారం... విజయనగరం జిల్లా లక్కవరపుకోట మండలం వీరభద్రపేట గ్రామానికి చెందిన నారపురెడ్డి చిన అప్పారావు (55) కటక్ వైపు వెళుతున్న ప్రత్యేక రైలు నుంచి జారి పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు చిన అప్పారావు ఈ నెల 2న గ్రామస్తులతో కలిసి గుంటూరు జిల్లా కారంపూడికి వ్యవసాయ పనుల కోసం వెళ్లాడు. 13 రోజుల అనంతరం పనులు ముగించుకుని ఇంటికి వెళ్లేందుకు రైలులో ప్రయాణిస్తూ హంసవరం రైల్వేస్టేషన్ సమీపంలో జారిపడి మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

కుంటుబడ్డ ఇంటి ప్రణాళికలు

- పట్టణాల్లో పట్టించుకోని ఎల్‌టీపీలు
- జీవో నంబర్ 20ని వ్యతిరేకిస్తూ నిరసన
- ఎల్‌టీపీలను బాధ్యులను చేస్తున్న ఎస్‌సీఎస్ విధానం
- నిలిచిన ప్లాన్ అప్రూవల్స్... తగ్గిన ఆదాయం


అమలాపురం మున్సిపల్ కార్యాలయం

అమలాపురం టౌన్: రాష్ట్ర ప్రభుత్వం పట్టణాల్లో బిల్డింగ్ ప్లాన్ అప్రూవల్‌పై తాజాగా జారీ చేసిన జీవో నంబర్ 20ని ఆయా పట్టణాల్లోని లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్లు (ఎల్‌టీపీ) తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఈ జీవో ద్వారా బిల్డింగ్ ప్లాన్ అప్రూవల్స్ స్వీయ సర్టిఫికేషన్ స్కీమ్ (ఎస్‌సీఎస్) విధానంతో ఆ బాధ్యతలను ఎల్‌టీపీలకు అప్పగించింది. అయితే ప్లాన్ ఇచ్చిన తర్వాత ఆ భవన యాజమాని ప్లాన్ అతిక్రమిస్తే ఎల్‌టీపీలను బాధ్యులను చేసి వారిపై చర్యలు తీసుకోవాలన్న నిబంధనను వారు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. దీంతో ఎల్‌టీపీలు జీవో వచ్చిన గత రెండు నెలల నుంచి 300 చదరపు మీటర్ల స్థలంలోపులో ఒక్క ప్లాన్ కూడా ఇవ్వకుండా నిరసన తెలుపుతున్నారు. ఫలితంగా జిల్లాలోని అమలాపురం, రామచంద్రపురం, మండపేట మున్సిపాలిటీలు, ముమ్మిడివరం నగర పంచాయతీల్లో ఏడున్నర సెంట్ల లోపు ముఖ్యంగా రెసిడెన్షియల్ బిల్డింగ్‌లకు ప్లాన్‌ల అప్రూవల్‌లు చేయకపోవడంతో ప్లానులన్నీ నిలిచిపోయాయి.

మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ అధికారులు ప్లాన్ ఇచ్చే విధానంలో లోపాలు జరుగుతున్నాయని ప్రభుత్వం ఆ బాధ్యతను ఎల్‌టీపీలకు అప్పగిస్తూ జీవో జారీ చేసింది. ఏదైనా బిల్డింగ్ ప్లాన్‌కు అనుమతి ఇస్తే 10 శాతం వరకూ అతిక్రమణ (డీవియేషన్)కు మినహాయింపు ఉంటుంది. అంతకుమించి అతిక్రమణ జరిగితే భవన నిర్మాణాన్ని నిలిపివేస్తారు. అయితే ప్లాన్ ఇచ్చిన ఎల్‌టీపీని బాధ్యుణ్ణి చేయడం, సంబంధిత ఎల్‌టీపీ లైసెన్స్‌ను అయిదేళ్ల పాటు రద్దు చేయడమే కాకుండా వారిపై క్రిమినల్ కేసులు కూడా ఉంటాయన్న జీవో నిబంధననే వారు పూర్తిగా వ్యతిరేకిస్తున్నారు.

మున్సిపాల్టీల ఆదాయాలకు గండి

ఎల్‌టీపీలు బిల్డింగ్ ప్లానులు ఇవ్వకపోవడంతో నిలిచిన భవన నిర్మాణాలతో ఆయా మున్సిపాలిటీలకు ఆదాయం గణనీయంగా పడిపోయింది. ఉదాహరణకు అమలాపురం మున్సిపాలిటీలో గత ఏడాది 300 చదరపు మీటర్ల లోపు భవనాలకు 170 వరకూ ప్లాన్‌లు ఇస్తే జీవో వచ్చిన నాటి నుంచి ఒక్క ప్లాన్ కూడా ఇవ్వలేదంటే పరిస్థితి ఎంత జటిలంగా ఉందో అంచనా వేయవచ్చు. రామచంద్రపురం, మండపేట మున్సిపాలిటీలు, ముమ్మిడివరం నగర పంచాయతీల్లో కూడా ఇదే పరిస్థితి. జిల్లా మొత్తం మీద మూడు మున్సిపాలిటీలు, ఒక నగర పంచాయతీలో ఈ జీవో అభ్యంతరాలు లేకపోతే ఈ రెండు నెలల్లో 100కి పైగా ప్లాన్లు మంజూరు చేసే అవకాశం ఉండేది. ప్లాన్‌లు ఇవ్వకపోవడంతో దాదాపు రూ.1.20 కోట్ల వరకూ ఆదాయానికి గండి పడింది. ప్లాన్‌లను ఎల్‌టీపీలు అనుమతించని పరిస్థితుల్లో కొత్తగా 300 చదరపు మీటర్ల లోపు స్థలంలో ఇళ్లు నిర్మించుకునే వారు సైతం ఈ కొత్త జీవో, నిబంధనలపై పెదవి విరుస్తున్నారు. జీవోను వ్యతిరేకిస్తూ ప్లాన్‌లు ఇవ్వని ఎల్‌టీపీల నిరసన ఓ పక్క సాగుతుంటే కొందరైతే ప్లాన్ అప్రూవల్ లేకుండానే సొంత ప్లాన్‌లతో ఇళ్లు నిర్మాణం చేపడుతున్నారు. మున్సిపాలిటీ పరంగా ఏదైనా అభ్యంతరం ఎదురైతే అప్పుడే చూద్దామన్న ధోరణిలో ముందుకు సాగుతున్నారు.

మాపై చర్యలను మినహాయిస్తే జీవోను స్వాగతిస్తాం

భవన యాజమానులు ప్లాన్‌ను అతిక్రమిస్తే తమను బాధ్యులను చేయని పక్షంలో జీవోను స్వాగతిస్తామని ఎల్‌టీపీలు అంటున్నారు. లేదా 300 చదరపు మీటర్లు దాటిన స్థలాలకు ప్లాన్‌ను అనుమతి ఇచ్చే బాధ్యతలు తమకు అప్పగించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. లేని పక్షంలో జీవో నంబర్20ని సవరించి ప్లాన్ అతిక్రమణ అయితే తమ లైసెన్స్ రద్దు చేయడం, క్రిమినల్ కేసు వంటి ఆంక్షలు తొలగించాలని సూచిస్తున్నారు. ఇళ్ల నిర్మాణాల్లో అతిక్రమణ జరిగితే భవన యాజమానిని బాధ్యులను చేయాలే తప్ప తమను బాధ్యులను చేయడమేమిటని ఎల్‌టీపీలు ప్రశ్నిస్తున్నారు.

ఒక్క ప్లాన్ కూడా అమలు కాలేదు

జీవో నంబర్ 20 వచ్చినప్పటి నుంచి అమలాపురం మున్సిపాలిటీలో 300 మీటర్ల లోపు ఇంటి స్థలాల్లో ప్లాన్ అప్రూవల్ అవ్వలేదు. 300 మీటర్లు దాటిన స్థలాల్లో పెద్ద భవనాలు, కమర్షియల్ భవనాలకు అనుమతులు ఇచ్చాం.


– రాణి సంయుక్త, టౌన్ ప్లానింగ్ అధికారి, అమలాపురం

జీవో నంబర్ 20ని సవరించాలి

మా ఎల్‌టీపీల ఉనికిని ఇబ్బంది పెట్టేలా ఉన్న జీవో నంబర్ 20ని ప్రభుత్వం సవరించాలి. జీవోలో ఆంక్షలు విధిండం మేం వ్యతిరేకిస్తున్నాం. జీవోను సవరించే వరకూ బిల్డింగ్‌లకు ప్లాన్ అప్రూవల్స్ ఇచ్చేది లేదు.

– యేడిద దొరబాబు, అధ్యక్షుడు, ఎల్‌టీపీల అసోసియేషన్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 – 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 – 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	19,000
గటగట (వెయ్యి)	17,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	18,000
గటగట (వెయ్యి)	16,000
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	13,000 – 13,500
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	13,000 – 13,500
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

రైళ్లలో చోరీలకు పాల్పడిన నిందితుడి అరెస్ట్

రూ.80 వేల సొత్తు స్వాధీనం

తుని: రైళ్లలో చోరీలకు పాల్పడుతున్న షేక్ యాసిన్ బాబాను అరెస్ట్ చేశామని తుని జీఆర్పీ ఎస్సై జి.శ్రీనివాసరావు గురువారం తెలిపారు. రాజమండ్రి రైల్వే డీఎస్పీ బిఎం.జయరాం ఆదేశాల మేరకు కాకినాడ లైన్స్ ఇన్‌స్పెక్టర్ టి.శ్రీనివాసరెడ్డి పర్యవేక్షణలో జీఆర్పీ, ఆర్పీఎఫ్ సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. తుని, అన్నవరం, నర్సీపట్నం, ఎలమంచిలి రైల్వేస్టేషన్ల పరిధిలో ప్రయాణికులు పొగట్టుకున్న బంగారం, సెల్‌ఫోన్లకు సంబంధించి ఫిర్యాదులు చేశారన్నారు. సాంకేతిక పరిజ్ఞానంతో మొబైల్స్ ట్రాక్ చేసి అనకాపల్లి జిల్లా రేగుపాలెంకు చెందిన షేక్ యాసిన్ బాబాను తుని రైల్వేస్టేషన్ ఒకటవ నంబరు ప్లాట్‌ఫాంపై పట్టుకుని విచారించామన్నారు. నిందితుడి నుంచి నాలుగు గ్రాముల బంగారం, రెండు సెల్‌ఫోన్లు, రూ.10 వేల నగదు స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేశామన్నారు. ఆర్పీఎఫ్ ఏఎస్సై గోవిందరావు, జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసరావు, శేఖర్, శివాజీ పాల్గొన్నారు.

రెండు గంటల్లో బాలిక ఆచూకీ

సీతానగరం: మండలంలోని ముగ్గళ్లకు చెందిన బాలిక అదృశ్యం అయిందని గురువారం ఇచ్చిన ఫిర్యాదుతో రెండు గంటల్లో ఎస్సై డి.రామ్‌కుమార్ ఆమె ఆచూకీ కనుగొని తల్లిదండ్రులకు అప్పగించారు. ముగ్గళ్ళకు చెందిన ఇంటర్మీడియెట్ సెకండియర్ ఫెయిల్ అయిన బాలిక బుధవారం ఉదయం 11.30 గంటలకు తన స్నేహితురాలిని కలవడానికి వెళుతున్నానని చెప్పి రాత్రి ఇంటికి రాలేదు. గురువారం ఉదయం 11 గంటలకు తల్లి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. రామచంద్రపురం, వంగలపూడి మధ్యలో ఆమె ఉన్నట్టు ఎస్సై ఫోన్ ట్రాకింగ్‌తో కనుగొన్నారు. హుటాహుటిన తన సిబ్బందితో వెళ్లి ఏటిగట్టు దగ్గరలో పంటపొలాల నుంచి వస్తున్న బాలికను పట్టుకుని తల్లిదండ్రులకు అప్పగించారు.

వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం జోనల్ అధ్యక్షుడిగా రమేష్



అమలాపురం టౌన్: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ విద్యార్థి విభాగం ఉభయ గోదావరి జిల్లాల జోనల్ అధ్యక్షుడిగా అమలాపురం నియోజకవర్గానికి చెందిన పార్టీ నాయకుడు జిల్లెళ్ల రమేష్‌ను పార్టీ కేంద్ర కార్యాలయం నియమించింది. రమేష్ గతంలో పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. పార్టీ ఆవిర్భావం నుంచి విద్యార్థి విభాగంలో పనిచేసిన అనుభవంతో రమేష్‌ను ఉభయ గోదావరి జిల్లాల జోనల్ అధ్యక్షునిగా పార్టీ నియమించింది.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల నమోదు

కాకినాడ రూరల్: స్థానిక సర్పవరం పోలీస్‌స్టేషన్ పరిధిలో తాగి వాహనం నడుపుతున్న వారిని గుర్తించి 12 కేసులను పోలీసులు నమోదు చేశారు. వాహన తనిఖీలలో భాగంగా, తాగి వాహనం నడిపిన వాహనదారులకు 3వ జ్యూడిషల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు జడ్జి జి.శ్రీదేవి శిక్ష విధించారు. 12 మందిలో 8 మందికి ఒకొక్కరికి రూ.10వేలు చొప్పున రూ.80వేల రూపాయల జరిమానా, నలుగురికి ఒకొక్కరికి రెండు రోజులు జైలు శిక్ష విధించారు.

పేదలకు ఇళ్ల స్థలాలివ్వాలి

- ప్రభుత్వ భూమి కబ్జాలను నిరోధించాలి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ డిమాండ్
- నగరంలో భూ పరిరక్షణ పోరాటం



ప్రదర్శన నిర్వహిస్తున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ తదితరులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): నగరంలోని ఆవ పరిసర ప్రాంతాల్లో ఉన్న 28 ఎకరాల ప్రభుత్వ భూమిని పేదలకు ఇళ్ల స్థలాలుగా ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ భూమిని లీజు పేరుతో కబ్జా చేయడానికి కబ్జాదారులు ప్రయత్నాలు మొదలు పెట్టారని ఆరోపించారు. 'ఇంటి స్థలం కోసం పేదల గోడు' పేరిట సీపీఐ జిల్లా సమితి ఆధ్వర్యాన స్థానిక 16వ డివిజన్ ఆవ ప్రాంతం నుంచి సుమారు 4 వేల మందితో ప్రదర్శన గురువారం నిర్వహించారు. ఎస్‌టీపీ వద్ద మేకల కబేళాను ఆనుకుని ఉన్న 16 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని పేదలకు పంచాలని భూ పరిరక్షణ పోరాటం నిర్వహించారు. ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు గ్రామీణ ప్రజలకు 3 సెంట్లు, పట్టణ ప్రాంతాల ప్రజలకు 2 సెంట్ల చొప్పున స్థలాలు ఇవ్వాలని, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేయాలని, ప్రభుత్వ స్థలాలను కాపాడాలని పెద్ద పెట్టున నినాదాలు చేశారు. అనంతరం 16 ఎకరాల స్థలంలో ఎర్రజెండా పాతి, కొబ్బరికాయ కొట్టి, దీనిని పేదలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు అధ్యక్షతన జరిగిన సభలో రామకృష్ణ మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఇంటి స్థలాల హామీని మంగళగిరి మినహా ఇప్పటి వరకూ ఎక్కడా నెరవేర్చలేదని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇళ్ల స్థలాల కోసం 8 నెలలుగా ఆందోళనలు చేస్తున్నామన్నారు. రాజమహేంద్రవరం నడిబొడ్డున ఉన్న 28 ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జాకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, పేదల ఇళ్ల స్థలాలుగా పంచాలని డిమాండ్ చేశారు. పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేంత వరకూ తమ పోరాటం ఆగదని రామకృష్ణ అన్నారు. ఇళ్ల స్థలాల సమస్యను రెవెన్యూ మంత్రి దృష్టికి తీసుకుని వెళ్తామని చెప్పారు.

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ మాట్లాడుతూ, ఆవకు ఆనుకుని ఉన్న 16 ఎకరాల భూమిలో పేదలకు ఇళ్లు ఇవ్వాలని, సుదూర ప్రాంతాల్లో స్థలాలు ఇస్తే వారు ఇబ్బందులు పడతారని అన్నారు. ఇళ్ల స్థలాలపై తక్షణమే కార్యాచరణ ప్రకటించాలని రాజమహేంద్రవరం సిటీ, రూరల్ ప్రజాప్రతినిధులను డిమాండ్ చేశారు. తాము రాస్తున్న ప్రతి దరఖాస్తుదారుకు ఇక్కడే ఇంటి స్థలం మంజూరు చేయాలని, లేకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేసి త్వరలో ఇక్కడ పాకలు వేస్తామని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ కోనసీమ జిల్లా కార్యదర్శి కె.సత్తిబాబు, జిల్లా సహాయ కార్యదర్శి, జట్టు సంఘం అధ్యక్షుడు కుండ్రపు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.


కేంద్ర ప్రభుత్వ పథకాలపై పరిశీలన


గోర్సలో తాగునీటిని పరిశీలిస్తున్న జాతీయ వాష్ నిపుణుడు ఆనంద్ టి పీటర్

కొత్తపల్లి: కేంద్ర ప్రభుత్వం ద్వారా గ్రామాల్లో జరుగుతున్న పనులపై అధికారులు పూర్తి స్థాయిలో దృష్టి పెట్టాలని జాతీయ వాష్ నిపుణుడు ఆనంద్ టి పీటర్ అన్నారు. మండలంలోని నాగులాపల్లి, కొత్తఇసుకపల్లి, గోర్స, రమణక్కపేట గ్రామాల్లో గురువారం ఆయన పర్యటించారు. జల్ జీవన్ మిషన్ ద్వారా ప్రజలకు పూర్తి స్థాయిలో తాగునీరు అందుతోందా.. లేదా, అంగన్ వాడీ కేంద్రాలలో పిల్లలకు, గర్భిణులకు, బాలింతలకు స్వచ్ఛమైన తాగునీరు అందిస్తున్నారో లేదో ఆరా తీశారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పరిశీలించారు. తాగునీటికి సంబంధించి పూర్తిసయిలో గ్రామాల్లో నీటి పరిక్షలు అంశాన్ని అడిగి తెలుసుకున్నారు. స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ చెత్త సేకరణ జరుగుతుందా లేదా అన్న విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జల్‌జీవన్ మిషన్ ద్వారా ప్రతి గ్రామంలో ప్రతీ ఇంటికి కుళాయిని ఏర్పాటు చేయడంతో పాటు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలన్నారు. పారిశుద్ధ్య నిర్వహణపై దృష్టి పెట్టాలన్నారు. గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వం ద్వారా ఏర్పాటు చేసిన చెత్త నుంచి సంపద కేంద్రాలను పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని అన్నారు. ఆయన వెంట ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ రమణ, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

నాన్ స్టాప్ కీబోర్డు ప్లేయర్‌గా విద్యశ్రీ గిన్నిస్ రికార్డు


గిన్నిస్ రికార్డును అందుకుంటున్న విద్యశ్రీ



గిన్నిస్ రికార్డు సర్టిఫికెట్

రాయవరం: మండలంలోని మాచవరం గ్రామానికి చెందిన విద్యశ్రీ కీబోర్డు ప్లే చేయడంలో గిన్నిస్ రికార్డు సాధించింది. ఈ విషయాన్ని విద్యశ్రీ తల్లిదండ్రులు సురేష్, సుధారాణి గురువారం స్థానిక విలేకరులకు తెలిపారు. ప్రస్తుతం విద్యశ్రీ ప్రైవేట్ పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. కీబోర్డుపై ఉన్న ఆసక్తితో విజయవాడకు చెందిన హల్లెలూయ మ్యూజిక్ స్కూల్‌లో ఆన్‌లైన్ తరగతులకు హాజరై కీబోర్డు ప్లే చేయడంతో పాటు, మెళకువలను నేర్చుకుంది. ఈ నెల 14న హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో గిన్నిస్ రికార్డు ప్రతినిధుల చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నట్లు వారు తెలిపారు. గతేడాది డిసెంబరు 1న ఇన్‌స్టాగామ్ వేదికగా ఆన్‌లైన్‌లో గంట పాటు నిర్వహించిన పోటీలో విద్యశ్రీ పాల్గొంది. ఇదే పోటీలో 1,046 మంది ఒకే సమయంలో పాల్గొని గంట పాటు నిర్విరామంగా కీబోర్డు ప్లే చేశారు. గిన్నిస్ రికార్డులో భాగస్వామిగా ఉన్న విద్యశ్రీని గిన్నిస్ రికార్డు ఆఫ్ ఇండియా సంస్థ సర్టిఫికేట్, మెడల్‌ను ప్రదానం చేసింది. ఇంతకు ముందు విద్యశ్రీ కీబోర్డు ప్లేయర్‌గా ఆసియా బుక్ ఆఫ్ రికార్డు, ఇన్‌జనియస్ వరల్డ్ రికార్డును సాధించిందన్నారు. కీబోర్డు ప్లేయర్‌తో పాటుగా, చిత్రలేఖనంలో విద్యశ్రీ రాణిస్తున్నట్లు తెలిపారు.

ఫొటో స్టూడియోలో చోరీ

- రెండు కెమెరాలు, లాప్‌టాప్ దొంగల పాలు
- చోరీ సొత్తు విలువ రూ.1.80 లక్షలు


చోరీ జరిగిన ఆర్‌కే డిజిటల్ ఫొటో స్టూడియో

దేవరపల్లి: స్థానిక ఆర్‌కే డిజిట్ ఫొటో స్టూడియోలో గురువారం తెల్లవారు జామున చోరీ జరిగింది. గుండుగొలను–కొవ్వూరు రాష్ట్ర ప్రధాన రహదారి(పాత) పక్కన స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచి సమీపంలో గల డిజిటల్ స్టూడియోలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. దుండగులు కారులో వచ్చి స్టూడియో షట్టర్ తాళం బద్దలు కొట్టి లోపలకు ప్రవేశించినట్టు సమీపంలోని సీసీ కెమెరాల పుటేజీలో నమోదైంది. స్టూడియో యజమాని కె.రామకృష్ణ కథనం ప్రకారం బుధవారం రాత్రి పెళ్లి ఫొటోలు తీసి 2.30 గంటలకు స్టూడియోకు వచ్చి కెమెరాలు, హెచ్‌పీ ల్యాప్‌టాప్ స్టూడియోలో పెట్టి తాళం వేసి ఇంటికి వెళ్లారు. ఉదయం 9 గంటల సమయంలో స్టూడియోకి వచ్చి చూడగా తాళం బద్దలు కొట్టి ఉంది. షట్టర్ తీసి లోపలకు వెళ్లి చూడగా రెండు కెమెరాలు, హెచ్‌పీ ల్యాప్‌టాప్, రెండు హార్డ్ డిస్క్‌లు దొంగిలించుకుపోయినట్టు గుర్తించారు. హార్డ్ డిస్క్‌ల్లో సుమారు 30 పెళ్లిళ్ల ఫొటోలు ఉన్నట్టు ఆయన చెప్పారు. 3 గంటల సమయంలో చోరీ జరిగి ఉంటుందని ఆయన తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఎస్సై వి.సుబ్రహమణ్యం ఘటనా స్థలాన్ని పరిశీలించారు. సమీపంలోని సీసీ కెమెరాల పుటేజ్‌లను పరిశీలించారు. కారుకు నంబరు ప్లేట్‌కు స్టిక్కర్ అతికించి దొంగలు జాగ్రత్త పడ్డారు. క్లూస్ టీం వేలిముద్రలను సేకరించింది. బాధితుడు రామకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై సుబ్రహమణ్యం తెలిపారు. చోరీ జరిగిన వస్తువుల విలువ సుమారు రూ.1.80 లక్షలు ఉంటుందని చెప్పారు. నిత్యం ప్రజల రాకపోకలతో రద్దీగా ఉండే ప్రధాన రహదారిలోని మూడు రోడ్లు కూడలి ప్రదేశంలో ఇటువంటి చోరీలు జరగడం పట్ల వ్యాపారస్తులు ఆందోళన చెందుతున్నారు.

వెబ్‌సైట్‌లో ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితా

రాయవరం: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని అన్ని మేనేజ్‌మెంట్లకు చెందిన ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాలను డీఈవో వెబ్‌సైట్(డీఈవోఈజీ.ఓఆర్‌జీ)లో ఉంచారు. సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న వారి సీనియారిటీ జాబితాతో పాటుగా, వివిధ సబ్జెక్టు ఉపాధ్యాయుల(స్కూల్ అసిస్టెంట్ల) సీనియారిటీ జాబితాలను కూడా ఇందులో పొందుపర్చారు. సీనియారిటీ జాబితాలను ఉపాధ్యాయులు టీఐఎస్‌లో ఇచ్చిన సమాచారం ఆధారంగా, డ్రాయింగ్ అధికారి నిర్ధారించిన ప్రకారం తయారు చేశారు. సబ్జెక్టుల వారీ పదోన్నతులకు ఉపాధ్యాయులకు ఉండాల్సిన విద్యార్హతలకు జీవో నంబరు 67, జీవో నంబరు 15 ప్రాతిపదికన తీసుకోనున్నారు. ఇప్పటికే టీచర్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్(టీఐఎస్)లో ఉన్న పొరపాట్లకు సంబంధించి గ్రీవెన్స్‌లో ఇచ్చిన ఫిర్యాదుల మేరకు అప్‌డేట్ చేసినట్లు విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. అయితే ఏదైనా ఉపాధ్యాయుడి టీఐఎస్‌ను సంబంధిత డ్రాయింగ్ అధికారి నిర్ధారించకుంటే డీఈవో కార్యాలయంలో అప్‌డేట్ చేసేందుకు అవకాశముండదు. సీనియారిటీ జాబితాలో జిల్లా పరిషత్తు/మండల పరిషత్తు, ప్రభుత్వ, మున్సిపల్ యాజమాన్యాల్లో చేరిన ఎయిడెడ్ ఉపాధ్యాయులకు వారి సర్వీసును ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా లెక్కించి సీనియారిటీ జాబితాలో చూపించినట్లుగా అధికారులు చెబుతున్నారు. అంతర జిల్లా బదిలీల్లో వచ్చిన వారికి ప్రస్తుతం పనిచేస్తున్న జిల్లాకు వచ్చిన నాటి నుంచి మాత్రమే సర్వీసును లెక్కిస్తున్నారు. సీనియారిటీ జాబితాపై అభ్యంతరాలున్న ఉపాధ్యాయులు ఈ నెల 19వ తేదీ లోగా కాకినాడ డీఈవో కార్యాలయంలో తగిన ఆధారాలతో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. గడువు ముగిసిన తర్వాత అభ్యంతరాలు స్వీకరించే అవకాశం ఉండదు. ఉపాధ్యాయులంతా సీనియారిటీ జాబితాలను సరిచూసుకుని, వాటికి సంబంధించి తేడాలుంటే డీఈవో కార్యాలయంలో అప్పీలు చేసుకోవాల్సి ఉంటుంది.

సారాతో వ్యక్తి అరెస్టు

అమలాపురం రూరల్ అమలాపురం ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎస్‌కేవీవీడీ ప్రసాద్ ఆదేశాల మేరకు ఏఈఎస్ ఎ.అమర్‌బాబు తన బృందంతో కలిసి కామనగరువు గ్రామంలో దాడులు నిర్వహించగా కామన రామకృష్ణ సారా అమ్మకాలు నిర్వహిస్తుండగా అరెస్టు చేసి సరకు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి కోర్టుకు తరలించగా 14 రోజులు రిమాండ్ విధించారు. అయినవిల్లి మండలం విలసకు చెందిన రాయి రాజేష్ యానాం లిక్కర్ అమ్మకాలు నిర్వహిస్తుండగా బైండ్ ఓవర్ చేసినట్లు అమలాపురం సీఐ సత్యనారాయణ తెలిపారు.